బీద రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన రూప్ కుమార్ యాదవ్

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త – వైద్యం నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన పోలుబోయి న రూప్ కుమార్ యాదవ్ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రను నెల్లూరు నగరంలోని వారి నివాసగృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. బీద రవిచంద్రను శాలువాతో సన్మానించారు. అనంతరం మిఠాయి తినిపించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

భోజనం పెట్టలేదని ఎన్నికల సిబ్బంది ఆగ్రహం

కోట, నవంబరు 4 ప్రభాతవార్త కోట మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే విధులకు 300 మంది ఉద్యోగులు వచ్చారు. తమకు సరిపడ్డ భోజనం పెట్టలేదని ఎన్నికల సిబ్బంది మండి పడ్డారు. దీంతో ఆకలికేకలతో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పాడయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పొలింగ్ కేంద్రం కు తనిఖి వచ్చిన జిల్లా కలెక్టర్ కు సైతం ఉద్యోగులు ఆకలితో అలమట్టించమని వాపోయారు.

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ ప్రక్రియలో ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాటుపడితే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు
- 1,568 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల విధుల్లో 10,882 మంది సిబ్బంది నియామకం
- 3,000 మందికి పైగా పోలీసులతో పటిష్ట బందోబస్తు- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త – కలెక్టరేట్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలల్లో ఎవరైనా పోలింగ్ ప్రక్రియకు ఆటంకాలు కలిగించినా, హింసాత్మక ఘటనలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో మొత్తం 35 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఐదు స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 30 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు మొత్తం 10,882 మంది సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,568 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో 169 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 102 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఏడు క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించేందుకు 332 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 3,000 మందికి పైగా పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అబ్జర్వర్లు కూడా పోలింగ్ ప్రక్రియను నిశితంగా గమనిస్తారని ఆయన చెప్పార. పోలింగ్ ప్రక్రియలో ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాటుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

- ఆరు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

ఈ నెల 7వ తేదీన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 34 మండలాలకు సంబంధించి ఆరు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆత్మకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొడవలూరులో జీవనజ్యోతి జూనియర్ కళాశాల, ఉదయగిరిలో మేకపాటి గౌతంరెడ్డి అగ్రికల్చర్ కళాశాల, కావలిలో పీవీఆర్ విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల, గూడూరులో ఎస్.వి. ఆర్ట్స్ అండ్ డిగ్రీ కళాశాల, నెల్లూరులో వీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు.

నెల్లూరు కార్పొరేషన్ మేయర్‌గా కూటమి అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్

80 వేలకుపైగా మెజారిటీ తో ఘనవిజయం

నెల్లూరు, నవంబరు 4 ప్రభాతవార్త విద్య నెల్లూరు నగర రాజకీయాల్లో కూటమి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి కైవసం చేసుకుంది. అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో భారీ మెజారిటీతో రూప్ కుమార్ మేయర్‌గా ఎన్నికయ్యారు. సుమారు 80,170 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడంతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తొలిసారిగా మేయర్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకోవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతగా నిలిచింది. గతంలో నగర రాజకీయాల్లో ఆధిపత్యం ప్రదర్శించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. మొత్తం 72 డివిజన్లకు గాను వైఎస్సార్‌సీపీ కేవలం ఒక్క డివిజన్‌కే పరిమితం కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరోవైపు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించి నగర పాలనపై తమ పట్టును నిరూపించుకున్నారు. మిగిలిన స్థానాలను కూటమి అభ్యర్థులతో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన కౌంటింగ్ ప్రక్రియ అనంతరం వెలువడిన ఫలితాలు కూటమి విజయాన్ని ఖరారు చేశాయి.

మేయర్‌గా ఎన్నికైన రూప్ కుమార్ మాట్లాడుతూ

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఇంతటి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఘన విజయాన్ని అందించిన నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.నగర ప్రజలు మార్పును కోరుకున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన సాగిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.అలాగె తన విజయానికి సహకరించిన ఎంపి వెమిరెడ్డి దంపతులకి , మంత్రి నారాయణకి, కోటంరెడ్డి సోదరులకు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రూప్ అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

వీపీఆర్ దంపతులను కలిసిన రూప్ కుమార్ యాదవ్

- కూటమి అభ్యర్థిగా మేయర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత తొలిసారి మర్యాదపూర్వకంగా కలిశారు
- 80 వేలకు పైగా భారీ మెజారిటీ సాధించడంపై వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డి అభినందనలు
- నెల్లూరు ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని సూచన

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త – వైద్యం కూటమి అభ్యర్థిగా పోటీ చేసి నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్‌గా ఘన విజయం సాధించిన తెలుగు దేశం నాయకులు పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ బుధవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో అన్ని విధాలా అండగా నిలిచి, తన విజయానికి సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దంపతులిద్దరినీ సత్కరించారు. కూటమి నేతల మార్గదర్శకత్వంలో నెల్లూరు నగర అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కూటమి అభ్యర్థిగా పోటీ చేసి 80 వేలకు పైగా మెజారిటీతో ఘన విజయం సాధించినందుకు రూప్ కుమార్ యాదవ్‌ని వీపీఆర్ దంపతులు అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్లూరును అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

డబ్బు, అధికారం, బెదిరింపులతోనే కూటమి గెలుపు..

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్నిఅపహస్యం చెసారు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ధ్వజం

నెల్లూరు , నవంబరు 4 ప్రభాతవార్త విద్య నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి డబ్బు, అధికార దుర్వినియోగం, బెదిరింపులు, అక్రమాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియలో అడుగడుగునా అధికార దుర్వినియోగం జరిగిందని, ప్రతిపక్ష అభ్యర్థులను పోటీ చేయకుండా అడ్డుకునేందుకు అనేక కుట్రలు పన్ని కుతంత్రాలకు దిగారని ఆయన మండిపడ్డారు. బుధవారం నగరంలోని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు . ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కానీ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశమే లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేసారు. ఐదేళ్లపాటు ప్రజల మధ్య ఉండి సేవ చేసిన అభ్యర్థులను నామినేషన్ దశలోనే వివిధ కారణాలు చూపించి అనర్హులుగా ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం నుంచి ఎన్ని బెదిరింపులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పోరాడిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, కార్యకర్తలను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజల కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అర్ధరాత్రి అయినా వారి దగ్గరకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని, వారి కోసం ఎంతవరకైనా పోరాడుతానని హామీ ఇచ్చారు. రెండేళ్ల తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రజల కోసం పోరాడిన ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం, గుర్తింపు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

నెల్లూరు నగరంలో డివిజన్ల విభజన మొదలుకొని ఓటర్ల జాబితాల తయారీ వరకు అనేక అవకతవకలు జరిగాయని,వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న ప్రాంతాలను ముక్కలు చేసి వేర్వేరు డివిజన్లలో కలిపేందుకు ప్రయత్నించారని తెలిపారు . ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం, పోలింగ్ కేంద్రాలను మార్చడం ద్వారా అభ్యర్థులను, ఓటర్లను గందరగోళానికి గురిచేశారని,63వ డివిజన్ నుంచి పోటీ చేసిన జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సిద్ధిక్ నామినేషన్‌ను అన్యాయంగా తిరస్కరించారని పేర్కొన్నారు . అలాగే కబాడిపాలెం ప్రాంతానికి చెందిన శాంతి అనే మహిళ నామినేషన్‌ను కూడా అన్యాయంగా తిరస్కరించారని , ఆమె టౌన్ లెవల్ ఫెడరేషన్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారనే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించారని పెర్కొన్నారు .

నెల్లూరు సిటీలోని 57 , 64, 58, 69, 10వ డివిజన్లలో పోటీ చేస్తున్న అభ్యర్థులపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చారని , నామినేషన్లు ఉపసంహరించుకోవాలని డబ్బులు ఆశ చూపడం, లేదంటే కేసులు పెడతామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డారని తెలిపారు . నెల్లూరు నగర ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఎన్నడూ లేనంతగా పెరిగిదని అరోపించారు . ఏది ఏమైనా ప్రజా సమస్యలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు .

అక్రమ రవాణా చేస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కావలి, నవంబర్ 4, ప్రభాతవార్త ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని టాటా ఏసీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జలదంకి పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకోవడం జరిగింది. వాహనాల తనిఖీలలో భాగంగా రేషన్ బియ్యాన్ని బుచ్చిరెడ్డిపాలెం నుంచి కావలి వైపుకు తరలిస్తుండగా రేషన్ బియ్యాన్ని జలదంకి ఎస్ఐ పీరేంద్రబాబు తన సిబ్బందితో కలిసి గుర్తించి వాహనాన్ని డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని జలదంకి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. వాహనంలో 50కిలోల 35 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు జలదంకి పోలీసులు తెలిపారు.

చీకట్లో మగ్గుతున్న 30 గిరిజన కుటుంబాలు

: నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా బంద్.. తాగునీటికీ ఇక్కట్లు

విడవలూరు, నవంబర్ 4 ప్రభాతవార్త : ఒవైపు విద్యుత్ లేదు.. మరోవైపు తాగునీరు అందడం లేదు. నాలుగు రోజులుగా చీకట్లోనే బతుకులు వెళ్లదీస్తున్నా తమను పట్టించుకునే వారు కరవయ్యారని ముదివర్తి పంచాయతీ పరిధిలోని గాంధీ గిరిజన కాలనీ రోడ్డు ప్రాంతానికి చెందిన 30 కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. చిన్నపిల్లలతో పడుతున్న ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నాయి.ఈ సమస్యపై బాధితులు పొట్లూరు శివకృష్ణ, చెంచెట్టి అరుణ, సరోజిని బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నివాస ప్రాంతం విడవలూరు మండలంలోని ముదివర్తి పంచాయతీ పరిధిలో ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా మాత్రం కోవూరు మండలం ఏగురు గ్రామం నుంచి వస్తోందని తెలిపారు. దీంతో సమస్య తలెత్తినప్పుడు ఏ ప్రాంత అధికారులను ఆశ్రయించాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నాలుగు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో తాగునీటికి సైతం ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలోనైనా తమ గిరిజన కుటుంబాల కష్టాలను గుర్తించి సమస్య పరిష్కరించాలని బాధితులు కోరారు. విద్యుత్ సరఫరాను ముదివర్తి పంచాయతీ పరిధికి అనుగుణంగా అనుసంధానించి, శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు.

మంచి అభ్యర్థులను ఎన్నుకోండి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచన

కోట, నవంబర్ 4 ప్రభాతవార్త జిల్లా వ్యాప్తంగా గురువారం జరగనున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో మంచి అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం కోట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్నికల విధులకు వెళుతున్న ఉద్యోగులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 34 మండలాల్లో పదివేలకు పైగా పోలింగ్ సిబ్బంది ఎన్నికల్లో విధులు నిర్వహిస్తారని చెప్పారు. కాగా, ప్రజాస్వామ్య దేశంలో మంచి సేవ చేసే అభ్యర్థులను ఎన్నుకుంటే గ్రామాలకు కావలసిన మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజి, మంచినీటి సదుపాయా కల్పిస్తారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. కొంతమంది ఉద్యోగులు సమయానికి భోజనం పెట్టలేదని, దీంతో ఎంతోమంది బీపీ,మధుమేహం ఉన్న వారు ఇబ్బందులు పడ్డారని కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు, ఎంపీడీఓ ఆర్.దిలీప్‌కుమార్, ఇతర శాఖల ఉద్యోగులు ఉన్నారు.

ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధే ఇక అందరి లక్ష్యంగా సాగుదాం

మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి

ఆత్మకూరు,నవంబర్ 4,ప్రభాతవార్త : ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికలు ముగిశాయని, కూటమి విజయం సాధించిందని, ఇక అందరి లక్ష్యం మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధి అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరులోని రవితేజ కళ్యాణ మండపంలో విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ ఆత్మకూరు పురపాలక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఆత్మకూరులో ఎన్డీఏ కూటమి విజయం సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి కార్యాలయంలో గెలుపొందిన చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు,నాయకులు, కార్యకర్తలతో మంత్రి ఆనం సమావేశం నిర్వహించారు. పురపాలక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఆశీర్వదించిన ఆత్మ కూరు ప్రజలకు మంత్రి ఆనం కృతజ్ఞతలు తెలి పారు. ప్రజలు ఎన్డీఏ కూటమిపై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనం అని మంత్రి ఆనం పేర్కొన్నారు. ఆత్మకూరు అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పురపాలక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు మంత్రి ఆనం అభినందనలు తెలిపారు. స్థానిక సంస్థల్లోనూ ఎన్డీఏ కూటమి విజయానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రి ఆనం నాయకులకు సూచించా రు.గురువారం జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ఆనం కోరారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్ర మాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల మిగతా 2 పేజీలో

ఆత్మకూరు ఫలితం రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచి

- ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేసిన పోరాటం అభినందనీయం
- రేపటి ఎంపీటీసీ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలి
- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబర్ 4,ప్రభాతవార్త : ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం ధైర్యంగా నిలబడి పోరాడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కేడర్, కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలు పు తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో వైఎస్సార్సీపీ తరపున ఎన్నికల బరిలో నిలిచివి జయం సాధించిన, పోటీ చేసిన అభ్యర్థులను మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నియోజ కవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి నాయకులతో కలసి క్యాంపు కార్యాలయంలో అభినందించారు. అనంతరం వారు నాయకులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో విక్రమ్ రెడ్డి మాట్లాడారు.ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అధికార పార్టీ అనేక అడ్డంకులు సృష్టిస్తూ, ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోకుండా ప్రయత్నించిందని ఆరోపించారు. అయినప్పటికీ ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెనక్కి తగ్గకుండా నిలబడి ప్రజలకు ఓటు హక్కు కల్పించేందుకు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.రాష్ట్రంలోని పులివెందుల, కడప, బద్వేలు తదితర ప్రాంతాల్లో కూడా ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్ల సమయంలో ఇబ్బందులకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ఓటు హక్కును కాపాడేందుకు ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ కేడర్ చేసిన కృషి తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం నుంచే అధికార పార్టీ రాజకీయాలకు తెరతీసిందని, బీసీ రిజర్వేషన్ కేటాయింపులో తమ పార్టీ తరఫున డాక్టర్ ఆదిశేషయ్యను అభ్యర్థిగా నిలబెట్టేందుకు ప్రయత్నించిన సమయంలో ఆయనపై వివిధ రకాలుగా ఒత్తిడి తీసుకొచ్చారని, అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదన్నారు.

మిగతా 2 పేజీలో

ఆత్మకూరు ఫలితం రాష్ట్ర రాజకీయాలకు దిక్సూచి

మొదటిపేజీ తరువాయి అనంతరం తమకు ఓటమి తప్పదని భావించిన అధికార పార్టీ రాజకీయ అధికారాన్ని ఉపయోగించి రిజర్వేషన్‌ను మార్చించిందని, అభ్యర్థుల ఎంపికలోనూ కుటుంబాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించారన్నారు. ప్రజల్లో ఉంటూ, ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థులనే ఎంపిక చేయాలన్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూచనల మేరకు తమ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఎన్ని బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదురైనా వైఎస్సార్‌సీపీ తరఫున 63 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, టీడీపీ తరఫున 57 నామినేషన్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. చివరి రోజు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడానికి కొద్ది నిమిషాల ముందు తమ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారని చెప్పారు.వెంటనే తమ పార్టీ నాయకులు సంబంధిత కార్యాలయానికి వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారని, అభ్యర్థి సంతకం, ప్రపోజర్ వివరాలతో పాటు సీసీటీవీ ఫుటేజీని చూపించాలని కోరినప్పటికీ సరైన సమాధానం రాలేదన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, ప్రస్తుతం హైకోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. కౌంటింగ్ సమయంలోనూ కొన్ని వార్డుల్లో తమ అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నప్పటికీ రీకౌంటింగ్ పేరుతో ఫలితాలను మార్చేందుకు ప్రయత్నించారని విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. ఒక వార్డులో తొలుత 28 ఓట్ల ఆధిక్యాన్ని ప్రకటించి, అనంతరం రీకౌంటింగ్ నిర్వహించి ఎనిమిది ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటించారని తెలిపారు. మరో వార్డులో మూడుసార్లు రీకౌంటింగ్ నిర్వహించినప్పటికీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థే ఆధిక్యంలో నిలిచారని చెప్పారు.అధికారికంగా వైఎస్సార్‌సీపీ, సీపీఎం కలిపి 11 స్థానాల్లో విజయం సాధించాయని, మరికొన్ని స్థానాల్లోనూ తమ పార్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎండోమెంట్ భూముల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ కొందరు ఓటర్లపై ఒత్తిడి తెచ్చారని, భయపెట్టి ఓట్లు వేయించుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు.ఎన్ని ప్రలోభాలు, బెదిరింపులు, అధికార దుర్వినియోగం జరిగినా వైఎస్సార్‌సీపీ కేడర్ గట్టిగా నిలబడిందని, ప్రజల అభిప్రాయం ఏమిటో ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయని విక్రమ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కేడర్ ఒక మహాసముద్రం లాంటిదని, చిన్నచిన్న రాజకీయ ప్రయత్నాలతో ఆ పార్టీని అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు.స్థానిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రజల్లోకి వెళ్లి ప్రజాభిమానం పొందాల్సింది పోయి, ఇతర ప్రాంతాల నుంచి అభ్యర్థులను తీసుకొచ్చి ఎన్నికలు నిర్వహించారని విమర్శించారు. ఆత్మకూరు పరిధిలో సుమారు 60 ఎంపీటీసీ స్థానాలుండగా, దాదాపు 30 స్థానాల్లో అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్నారని ఆరోపించారు. చేజర్లలోనూ పది స్థానాలకు పది చోట్ల ఇబ్బందులు సృష్టించారని పేర్కొన్నారు. కొంతమంది అభ్యర్థులకు నివాస ధ్రువీకరణ పత్రాల పేరుతో ఇబ్బందులు కల్పించారని, మరికొన్ని చోట్ల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత కార్యాలయాల తలుపులు మూసివేసి అభ్యర్థులను బలవంతంగా ఉపసంహరింపజేసినట్లు ప్రకటించారని ఆరోపించారు. సంబంధిత ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఆధారాలు సేకరించడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఎన్నికల ప్రక్రియ నిర్వహించిన చోట్ల సమగ్ర విచారణ జరిపి, అన్యాయం జరిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు చెప్పారు. రేపు జరగనున్న ఎంపీటీసీ ఎన్నికలను అధికారులు పూర్తి స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని విక్రమ్‌రెడ్డి కోరారు. ఏ ఒక్క ఓటరుకు కూడా అన్యాయం జరగకూడదని, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బంది అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించకుండా రాజ్యాంగబద్ధంగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు.ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తరఫున ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు విక్రమ్‌రెడ్డి వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పలు ప్రాంతాల్లో తమ పార్టీ తరఫున సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల అక్రమాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, ఇతర ఆధారాలను వెంటనే పంపించాలని కోరారు. రేపటి ఎన్నికల్లో తాను స్వయంగా ఎన్నికల ఏజెంట్‌గా కూర్చుంటానని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్టీ శ్రేణులంతా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఎలా పాలన సాగించిందో, ప్రజల హక్కులకు ఏ విధంగా భంగం కలిగిందో ప్రజలు ఆలోచించాలని విక్రమ్‌రెడ్డి కోరారు. ఎలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉందని, ఇప్పటికైనా రాజకీయ కక్షసాధింపు చర్యలు, అధికార దుర్వినియోగం మానుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని హితవు పలికారు. మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీ తరఫున ప్రజల పక్షాన నిలబడి గత రెండేళ్లలో జరిగిన అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలు చూపిన తెగువ, పట్టుదల రేపటి ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కొనసాగాలని, ప్రజలు నిర్భయంగా ఓటు వేసి తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలని మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో పట్టణ వైసీపీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ చైర్మన్ అభ్యర్థి అల్లారెడ్డి ఇందుమతి, వైసీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ కౌన్సిలర్ లుగా ఎన్నికైన వారు,పాల్గొన్నారు.

ఆత్మకూరు సర్వతోముఖాభివృద్ధే ఇక అందరి లక్ష్యంగా సాగుదాం

మొదటిపేజీ తరువాయి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి చైర్మన్, కౌన్సిలర్లతో పాటు ఇతర పార్టీలనుండి గెలిచిన వారిని కూడా కలుపుకొని ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేద్దామని మంత్రి పేర్కొన్నారు.మంత్రి ఆనం సమావేశానికి భారీగా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా, యువ నేత బొమ్మిరెడ్డి తారక్ నాథ్ రెడ్డి, తెలుగుదేశం, బిజెపి, జనసేన కౌన్సిలర్లు గా విజయం సాధించిన వారు, తెలుగుదేశం నాయకులు తాళ్లూరు గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రా రెడ్డి, చల్లా రవికుమార్ రెడ్డి, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రా రెడ్డి, ఏ ఎం సి వైస్ చైర్మన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, మట్లే సురేంద్ర రెడ్డి,పలువురు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడే స్థానిక పోరు

- స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం

చిల్లకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎన్నికల అధికారి శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. బుధవారం చిల్లకూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో 10 ఎంపీటీసీ స్థానాల్లో జరిగే ఎన్నికలకు సంబంధించి ఎన్నికలకు సంబంధించి 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ అధికారులుగా పి ఓలు 41, ఏపీవోలు 41తో పాటు ఓపిఓలను 145 మందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 13 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమసాత్మక పోలింగ్ కేంద్రాలుగా, ఐదు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగింది అన్నారు. ఆ పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టడం జరిగిందన్నారు మొత్తం 30137 ఓట్లు ఉండగా పురుషులు 14850, మహిళలు 15287 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోన్నారు. అదే విధంగా గూడూరు డిఎస్పి నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీఐ వెంకట్రావు ఎస్ఐ సురేష్ బాబు సూచనలతో 6 మొబైల్ టీం వాహనాలతో పాటు 70 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికలు నిర్వహణలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ జ్యోతి ఎంపీడీవో వెంకట్రావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల సామాగ్రి పంపిణీ

గూడూరు, నవంబర్ 4, ప్రభాతవార్త : నేడు జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మెటీరియల్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున రావు పోలింగ్ అధికారులకు అందచేశారు. గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు ప్రాంతాల నుండి వచ్చిన అధికారులకు, సిబ్బందికి మెటీరియల్‌ను అందచేశారు. 8 మంది ఎంపీటీసీ అభ్యర్థులకు 16 మంది పోటీలో ఉన్నారు. 8 మంది టీడీపీ, 8 మంది వైసీపీ నుండి పోటీలో ఉన్నారు. అదేవిధంగా జడ్పీటీసీ బరిలో టీడీపీ నుండి ఒకరు, వైసీపీ నుండి ఒకరు, స్వతంత్ర అభ్యర్థి నుండి ఒకరు బరిలో ఉన్నారు. 32 పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఇప్పటికే అధికారులు ఓటర్లకు స్లిప్‌లను అందచేశారు. సిబ్బందిని, అధికారులను ఆర్టీసీ బస్సుల్లో వారి పోలింగ్ స్టేషన్‌లకు తరలించారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 8 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ బరిలో ఎంపీటీసీలకు 16 మంది, జడ్పీటీసీలకు ముగ్గురు పోటీ

గూడూరు, నవంబర్ 4, ప్రభాతవార్త : నేడు జరనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కుఅన్ని ఏర్పాట్లుపూర్తి చేశామని అధికారులు తెలిపారు. గూడూరు మండల పరిధిలోని 8 ఎంపిటిసి, ఒక జడ్పీటీసీ స్థానాలకు నేడు పోలింగ్ జరగనుంది. 32 పోలింగ్ కేంద్రాల్లోఅన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 32 పి.వోలు, 32 మంది ఏపీవోలు, 168 మంది ఓపివోలు 192 మంది పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తారు. రిజర్వుడ్ సిబ్బందితో కలిసి సుమారు 230 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన నున్నారు. పోలీస్ శాఖ తరపున సుమారు వంద మంది పోలీస్ లు విధులు నిర్వహించనున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. 6 మొబైల్ టీమ్‌లు, ఒక డీఎస్పీ టీమ్, ఒక సిఐ టీమ్,రెండు ఎస్ఐ టీమ్‌లు నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు. వెబ్ కాస్టింగ్, సిసి కెమెరాల పర్యవేక్షణలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

గూడూరు రూరల్, నవంబర్ 4, ప్రభాతవార్త : అనుమానంతో భార్యను భర్త హతమార్చిన సంఘటన వెడిచర్ల ఎస్టి కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని వెడిచర్ల గ్రామంలోని ఎస్‌టి కాలనీలో నివాసం ఉంటున్న ఆదూరి శైలజ (30) సంవత్సరాలు అను ఆమెకు మునికృష్ణయ్య అనే వ్యక్తితో 15 సంవత్సరాల క్రితం వివాహమై, ఇద్దరు కుమారులు సంతానం ఉన్నారు. అయితే శైలజను తన భర్త మునికృష్ణయ్య అనుమానిస్తు తరచుగా వారికి గొడవలు జరుగుతుండినట్లు, ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం సుమారు 01.30 గంటల సమయంలో తమ ఇంటి వద్ద మునికృష్ణయ్య మద్యం మత్తులో తన భార్యతో గొడవపడి, కర్రతో తలపై కొట్టి చంపినాడని శైలజ తండ్రి అయిన ఆదూరి చెంచు కిష్టయ్య ద్వారా రాబడిన ఫిర్యాదుపై, గూడూరు రూరల్ పోలీస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ కెమెరాల ఏర్పాటు
- ఎన్నికల విధుల్లో 11 వేల మంది సిబ్బంది, 3 వేల మంది పోలీసుల నియామకం
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త - కలెక్టరేట్ : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వెంకటాచలం, గూడూరులో ఏర్పాటు చేసిన రిసెప్షన్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించిన విధులు, ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 34 మండలాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ అందించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 1,568 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ కెమెరాలను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల విధుల నిర్వహణకు సుమారు 11 వేల మంది సిబ్బందిని, భద్రతా ఏర్పాట్లలో భాగంగా 3 వేల మంది పోలీసులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు.

జవహర్ భారతి కళాశాలలో బ్రిక్స్ వారోత్సవాలు

కావలి, నవంబర్ 4, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యా మండలి వారి ఆదేశాల మేరకు అంతర్జాతీయ ఒప్పంద వ్యవస్థ బ్రిక్స్ 2026 ఏడు రోజుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆహార వ్యర్థాలు తగ్గింపు, సేంద్రియ కంపోజ్ ఎరువుల తయారీ అనే అంశంపై కళాశాల జీవశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ జి.రమణారెడ్డి ప్రధాన వక్తగా విచ్చేసి మాట్లాడారు.. ధాన్యపు వ్యర్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆహార వ్యర్థాలను ప్రతి మనిషి తగ్గించాలని ఆహార పదార్థాలను స్వతహాగా తయారు చేయటం నేర్చుకోవాలని కోరారు. ఆహార పదార్థాలను జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలని మిగిలిపోయిన పదార్థాలను వ్యర్థం కాకుండా చేసుకోవాలని, తడి పొడి వ్యర్థాలను వేరు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. సేంద్రియ వ్యర్థాలను మైక్రో ఆర్గానిక్ సహాయంతో పోషకాలు కలిగిన ఎరువుగా మార్చే ప్రక్రియను చేపట్టాలని, వ్యర్థాలను ఆర్గానిక్ కంపోజ్‌గా మార్చడం వల్ల వ్యర్థాలను కూడా సంపదగా మార్చవచ్చని తెలియజేశారు. అందుకు అనుగుణంగా మనమందరం రెడ్యూస్ రీయూస్ రీసైకిల్ నిబంధనలను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ ఆర్.మల్యాద్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్‌కే అయూబ్ అహమ్మద్, టి.వి రమణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

శాసన మండలి మాజీ చైర్మన్ డా. ఏ. చక్రపాణి మరణం తీరని లోటు

- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త - వైద్యం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ ఏ. చక్రపాణి మరణం పట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలిని పునరుద్ధరించిన అనంతరం తొలి చైర్మన్‌గా డాక్టర్ చక్రపాణి ఎంతో నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేసుకున్నారు. పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల అపారమైన గౌరవం కలిగిన చక్రపాణి చైర్మన్‌గా నిష్పక్షపాతంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అంకితభావంతో ఆయన ఎన్నో సేవలందించారని కొనియాడారు. డాక్టర్ చక్రపాణి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

మధ్య వర్తిత్వంతో పెండింగ్ కేసులు పరిష్కారం

కావలి, నవంబర్ 4, ప్రభాతవార్త : కోర్టుల్లో మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చు అని కావలి లోక్‌అదాలత్ సభ్యులు ముడిగంట్ల మాలకొండారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు.. కోర్టుల్లో కేసులు అనేక కారణాలతో ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయని తెలియజేశారు. వాటిని త్వరగా పరిష్కరణకు సమయం, నగదు వృధాను అరికట్టే ందుకు ఈ మధ్యవర్తిత్వం కేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. కక్షిదారులు ఈ మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకొని సత్వర న్యాయం పొందాలని కోరారు.

జడ్‌పిటిసి,ఎంపిటిసి ఎన్నికలకు సర్వం సిద్ధం

7 ఎంపిటిసి సెగ్మెంట్లలో ఎన్నికలు

సంగం నవంబర్ 4 ప్రభాతవార్త : ఈనెల 5 న జరగనున్న జడ్‌పిటిసి,ఎంపిటిసి ఎన్నికలకు సంబందించి సర్వం సిద్ధం అయింది. సంగం మండలంలో 44 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నిక నిర్వహణకు సర్వం సిద్ధమైంది.డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఎన్నికల సామాగ్రి స్వీకరించి సిబ్బంది ప్రత్యేక వాహనాల ద్వారా కేటాయించిన పోలింగ్‌కేంద్రాలకు చేరారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభ కానున్న నేపద్యంలో సర్వం సిద్ధం అయింది. పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో 13 ఎంపిటిసి స్థానాలు ఉండగా ఆరు ఎంపిటిసి స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి,7 ఎంపిటిసి సెగ్మెంట్లలలో ఎన్నికలు జరుగుతున్నాయి.ఓటర్లు మొత్తం 35913 మంది ఉండగా పురుషులు 17391 ,మహిళా ఓటర్లు 18521 మంది ఉన్నారు. ట్రాన్స్ జండర్ ఒక్కరు ఉన్నారు.7 ఎంపిటిసి స్థానాలకు గాను టిడిపి,వైసిపి,బిజెపం,జనసేన,బిఎస్‌పి,అభ్య ర్థులు 23 మంది బరిలో ఉన్నారు. ఒక జడ్‌పిటిసి స్థానానికి టిడిపి, వైసిపి, బిఎస్‌పి, ఇండిపెండెంట్ నలు గురు బరిలో ఉన్నారు. గురువారం సంగం మండలంలో 7 ఎంపిటిసి సెగ్మెంట్లలలో ఎన్నికలు జరగనున్నాయి.

మైదానంలో విద్యార్థులతో ఆటలాడిన మంత్రి కుమార్తె షరణి

- క్రీడలతోనే పిల్లలకు ఉజ్జ్వల భవిష్యత్తు - విద్యార్థులతో కలిసి గ్రౌండ్‌లో సందడి చేసిన షరణి పొంగూరు
- ఆటగాడిగా మారిన షరణి - పిల్లలతో కలిసి క్రీడల్లో ఉత్సాహం - వీఏపీ హోదా మరిచి.. విద్యార్థులతో ఆడుకున్న షరణి - నెల్లూరు ఎంఎస్ఎం స్కూల్ విద్యార్థుల ఘనతకు నీరాజనాలు

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త - వైద్యం : నెల్లూరు ఎంఎస్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారు. ఏకంగా ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో, మరో 30 మందికి పైగా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపికై నెల్లూరు ఘనకీర్తిని దేశవ్యాప్తంగా చాటుతున్నారు. అయితే ఈ విద్యార్థుల కష్టాన్ని, ప్రతిభను గుర్తించి గతంలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర మంత్రి నారాయణ కుమార్తె షరణి పొంగూరు ప్రత్యేకంగా ఎంఎస్ఎం పాఠశాలకు విచ్చేశారు. వేదికలకే పరిమితం కాకుండా నేరుగా మైదానంలోకి దిగిన ఆమె విద్యార్థులతో కలిసి కోకో, సాఫ్ట్ బాల్, వాలీబాల్ వంటి ఆటలు ఆడి మైదానంలో పండుగ వాతావరణం నింపారు. తండ్రి నారాయణలాగే మాట ఇస్తే అది అయ్యేవరకు వదలరు అని షరణి పొంగూరు మరోసారి నిరూపించారు. నెల్లూరు ఎసి నగర్‌లోని ఎంఎస్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఇప్పుడు క్రీడా విప్లవానికి చిరునామాగా మారింది. చదువుతో పాటు ఆటల్లోనూ సత్తా చాటుతూ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నెల్లూరు పేరును సమున్నతంగా నిలబెడుతున్నారు. ఈ పాఠశాల నుంచి అండర్ 19 విభాగంలో డి.రిషిత, టి.తులసి (సాఫ్ట్ బాల్ చండీగర్), సిహెచ్ నందిని (ఖోఖో మధ్యప్రదేశ్), వై. చరణ్ కుమార్ (క్రికెట్ లక్నో), అలాగే ఇ. సిద్ధు, ఎం. జగదీష్ (అట్యాపట్యా, ఖోఖో, జమ్మూ కాశ్మీర్) జాతీయ స్థాయికి ఎంపిక కాగా, వీరితో పాటు మరో 30 మందికి పైగా విద్యార్థులు కోకో, సాఫ్ట్ బాల్, బేస్ బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్ క్రీడలలో నెల్లూరు జిల్లా జట్టు తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే మంత్రి నారాయణ కుమార్తె షరణి పొంగూరు పాఠశాలను సందర్శించి విద్యార్థులలో సరికొత్త జోష్ నింపారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా ఎంఎస్ఎం స్కూల్‌కే విచ్చేశారు. పిల్లలతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించడమే కాకుండా మైదానంలో విద్యార్థులతో కలిసి కోకో, సాఫ్ట్ బాల్, వాలీబాల్ ఆటలు ఆడి అందరినీ ఆశ్చర్యపరిచారు. అనంతరం మీడియాతో మాట్లాడిన షరణి పొంగూరు హెచ్ఎం మురళీకృష్ణ, పిడి అజయ్ కుమార్ టీచర్ల కృషితోనే ఈ సాధన సాధ్యమైందని కొనియాడారు. తన సొంత నిధుల నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులకు స్పోర్ట్స్ వేర్, షూస్, ట్రాక్ ప్యాంట్లు, కిట్లను అందజేశారు. ఎంఎస్ఎం విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరు ఘనతను నిలబెడతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా డిస్ట్రిబ్యూషన్ ఏర్పాటు

- పోలింగ్ కేంద్రానికి బయలుదేరిన ఎన్నికల అధికారులు

కోవూరు, నవంబరు 4 ప్రభాతవార్త : కోవూరులోని పీఆర్ఎన్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 5న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం మండలంలో 78 ప

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

దగదర్తి, నవంబర్ 4, ప్రభాతవార్త : మండలంలో నేడు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిహెచ్ నాగరాజు తెలిపారు. 11 ఎంపీటీసీ స్థానాలకు గాను 5 స్థానాలు ఏకగ్రీవం కాగా 6 స్థానాలకు, జెడ్పిటిసి స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో మొత్తం 45 పోలింగ్ స్టేషన్లో 298 మంది పోలింగ్ ఆఫీసర్లు ఇతర సిబ్బందితో పోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 30,520మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని వీరిలో 15031 మంది మగ, 15,489 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్క ఓటరు ఓటును వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లను విజయ్‌కుమార్, భాస్కర్‌లు పర్యవేక్షిస్తారన్నారు. పోలింగ్ బూతుల వద్ద ఎటువంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందితో పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

ఉదయగిరిలో ఎన్నికలపై ట్రైనీ కలెక్టర్ కీలక ఆదేశాలు

ఉదయగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త : ఉదయగిరి మండల పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ్ బుధవారం పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు కౌంటింగ్ కేంద్రాలు ఎన్నికల సిబ్బంది చేసిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు భద్రత చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి తాసిల్దార్ ఎల్ రామ్మోహన్, ఎంపీడీవో సుకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడే స్థానిక సంస్థల ఎన్నికలు

– విడిజమూరులో అన్నీ ఏర్పాట్లు పూర్తి

వింజమూరు, నవంబర్ 4, ప్రభాతవార్త : వింజమూరు మండలంలోని 42పోలింగ్ కేంద్రాల్లో గురువారం జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 42 పోలింగ్‌కేంద్రాల పరిధిలో 33,781 మంది ఓటర్లు తమ ఓటు మక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో మండల కేంద్రంలో 6 సెగ్మెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో చాకలకొండ, కాటేపల్లి, ఊటుకూరు, శంఖవరం, బుక్కాపురం, గుండెమడకలలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు 252 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్సుల్లో బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రితో సహాయ ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వెబ్ కాస్టింట్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి శేషగిరి తెలిపారు.

ఓట్లాభిషేకం నేడే

కోట,నవంబరు 4 ప్రభాతవార్త : కోట మండలంలో 16 ఎంపీటీసీలు,జెడ్పిటీసీ ఎన్నికల పోలింగ్ సర్వం సిద్ధమైంది.గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటేయవచ్చు. మండలంలోని 49 పొలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు.ఇందుకు 300 ఉద్యోగులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్నారు. మండలంలో 38000 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. బుధవారం కోట జెడ్పిబాలురు ఉన్నత పాఠశాల నుంచి పొలింగ్ కేంద్రాలకు పొలింగ్ సమాగ్రితో ఉద్యోగులు పోలీస్ బందో బస్తు మధ్య తరలి వేళ్లారు. కోత్తపాళెం,కేశవరం,కోత్తపట్నం, గూడలి కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాట్లు చేశారు .సమస్యాత్మక,అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలను మెహరించారు.ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు వెబ్ కాస్టింగ్,వీడియో గ్రఫీ నిర్వహిస్తున్నారు.పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంచారు.ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా నిమిషాల్లో బలగాలు చేరుకునేలా ఎస్పీ అజిత వెంజిడ్ల ఐదంచెల పద్ధతిలో భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది, గస్తీకి మొబైల్ పార్టీలు సమస్యాత్మక ప్రాంతాల్లో స్ట్రైకింగ్ ఫోర్స్,అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక ఆయుధాలతో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఉంటాయిని పోలీస్ అధికారులు తెలిపారు.

పోలింగ్ సామగ్రితో తరలిన ఉద్యోగులు

కోట, నవంబర్ 4 ప్రభాతవార్త : గురువారం జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి 42 పోలింగ్ కేంద్రాలకు బుధవారం ఉద్యోగులు వివిధ బస్సుల్లో తరలి వెళ్లారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం నుంచి ఉద్యోగులను తీసుకెళ్లడానికి బస్సులను సిద్ధం చేశారు. ఆ మేరకు ఎంపిడిఓ దిలీప్ కుమార్,తహశీల్దార్ కె.జయజయరావుల సమక్షంలో పల్లెలకు పోలింగ్ సామగ్రితో ఉద్యోగులు తరలి వెళ్లారు. ఒక్కొక్క బస్సుకు పోలీసులు ఎస్కార్టుగా తరలి వెళ్లారు.

ఆర్ఎస్ఆర్ లో 6వ తేదీన రాజారెడ్డి సంతాపసభ

బిట్రగుంట నవంబర్ 4 ప్రభాతవార్త: బోగోలు మండలం కదనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బారామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్లో నవంబర్ 6 వ తేదీన శుక్రవారం ప్రముఖ విద్యావేత్త, ప్రేరణ కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, అందరినీ కలుపుకొని పోయే గొప్ప మనసున్న వ్యక్తి అయిన డాక్టర్ కె. రాజారెడ్డి సంతాప సభను ఉదయం ఏర్పాటు చేయటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజారెడ్డి అభిమానులు శ్రేయోభిలాషులు శిష్య బృందం తదితరులు ఆరో తేదీ ఈ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని,వారి సేవలను స్మరించుకోవడానికి వీలుగా ఈ సభను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు కావున అందరూ ఈ సభలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

కలిగిరి మండలంలో 49 పోలింగ్ స్టేషన్లు,6రూట్లు

కలిగిరి,నవంబర్ 4, ప్రభాతవార్త: నేడు కలిగిరి మండలంలో 23 పంచాయితీలలో జరుగనున్న యంపిటిసి, జడ్పీటీసి ఎన్నికలకు మొత్తం 49 పోలింగ్‌స్టేషన్లను కేటాయించినట్లు కలిగిరి మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. శివప్రసాద్ తెలిపారు.ఎన్నికల సామాగ్రి, శిబ్బంది, సోలీస్ అందరినీ పోలింగ్ స్టేషన్లకుపంపిన సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కలిగిరి మండలంలో మొత్తం 49 పోలింగ్ బూతులను ఏర్పా టు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ బూతుల వద్ద అన్నిఏర్పాట్లూ పూర్తి చేయడం జరిగిందన్నారు.49 పోలింగ్ స్టేషన్లను 6రూట్లుగా విబజించి 6బస్సుల్లో పోలింగ్ శిబ్బందిని తరలించడం జరిగిందన్నారు.ఈమండలాన్ని మూడు జోన్లుగా విబజించామని ఎన్నికలకు మొత్తం 358మంది శిబ్బందిని నియమించడం జరిగిందని ఆర్ఓ తెలిపారు.కాగా కలిగిరి మండలంలో మొత్తం 38173మంది ఓటర్లు నేడు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 18909 మందికాగా,మహిళలు 19261, అద ర్స్ముగ్గురుతో కలిపి 38173మంది ఓటుహక్కు వినియోగించు కోనున్నారు.50మంది పోలీసులతో ఎన్నికల విదులు;కలిగిరి మండలంలో నేడు జరుగుతున్న యంపిటిసి,జడ్పీటీసి ఎన్నికలకు పూర్తి పోలీస్ బందో బస్తును ఏర్పాటు చేసినట్లు కలిగిరి సిఐ సుబ్బారావు,యస్ఐ, లతీఫున్నీసా తెలిపారు.ఎన్నికల సమయంలో ఎక్కడా ఇబ్బందులు జరక్కుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం 6 రూట్లుగా విబజించి 6రూట్ మొబైల్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు.ముగ్గురు యస్ఐ స్టైరింగ్ పోర్స్,ఇద్దరు సిఐ స్టైరింగ్ ఫోర్స్,ఒక డియస్పీ స్టైరింగ్ పోర్స్ పనిచేస్తుందన్నారు.మండలంలో కలిగిరి, కుమ్మరికొండూరు పోలింగ్ బూతులు సెన్సిట ీవిగానూ,గంగిరెడ్డిపాళెం, తూర్పు గుడ్లదొన హైపవర్ సెన్సి టివిగ్రామాలుగా గుర్తించడం జరిగిందన్నారు.యంపిటీసి,జడ్పీటీసి ఎన్నికలకు మొత్తం 50మంది పోలీసు లతో విదులు నిర్వహిస్తుమన్నారు.

ఎన్నికలకు పటిష్ఠ పోలీసు బందోబస్తు : సీఐ ఓ. దుర్గాప్రసాద్‌రావు

కొడవలూరు, నవంబర్ 4 ప్రభాతవార్త: నేడు జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో కొడవలూరు, విడవలూరు మండలాల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. దుర్గా ప్రసాద్‌రావు తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.కొడవలూరు ఎంపీడీవో కార్యాలయంలో, విడవలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి కేటాయించిన ప్రాంతాలకు బందోబస్తు విధుల నిమిత్తం పంపించారు.ఈ కార్యక్రమంలో రెండు మండలాల ఎస్సైలు కోటిరెడ్డి, సాయి కళ్యాణ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాంబూలంలో పెట్టి తాయిలాలు ఇస్తున్నాం! తప్పక ఓటు మాకేవేయండి

కలిగిరి, నవంబర్04, ప్రభాతవార్త; మీయంపిటిసి అబ్యర్థిగా పోటీచేస్తున్నా, పైగా తాంబూలంలో పెట్టి తాయిలాలు ఇస్తున్నాం. అందుచేత మీఓటు, మీఇంట్లో ఓట్లనీ మాకే వేయాలంటూ పోటీ చేస్తున్న అబ్యర్థులు ఎవరికి వారుఓటరు మహాశయులను వేడుకుంటున్నారు. నేడు రాష్ట్రంలో యంపిటిసి ,జడ్పీటీసి ఎన్నికల తోపాటు కలిగిరి మండలంలో జడ్పీటీసి, యంపిటిసి ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అబ్యర్థులు ఇప్పటివరకూ ప్రజల వద్దకు వెళ్లి మమ్మల్ని గెలిపిస్తే మీకు అవిచేస్తాం, ఇవిచేస్తాం ,మన ప్రాంతాన్ని అభివృద్ధిచేస్తాంమంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నారు. అంతేగాక , కులాలని,బందుత్వమని, మనపార్టీ అని, మనమంతో ఒకచోటవారిమేనంటూ రకరకాల ప్రచారాలు చేసుకున్నారు.మేముగెలిస్తే మీకు అదిచేస్తాం,ఇది చేస్తాం మీఅందరికీ అందుబాటులో ఉంటాం, మన ప్రాంత సమస్యలు తీరుస్తాం. మనసమస్యల్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. అంటూ చెప్పలేని వాగ్దానాలన్నీ గుపించారు. ఇక ఇవి చాలవన్నట్లు ప్రతి అబ్యర్థీ తన స్తాయికి మించి ఓటుకింత లెక్కన ప్రాంతాలను బట్టి, రిజర్వేషన్లను బట్టి నగదు పంపిణీచేశారు. ఇక చివరిసారిగా మీకు చెప్పాల్సింది చెప్పాం. ఇవ్వాల్సింది ఇచ్చాం! ఇక మిగిలింది మీఓటు మాత్రమే. మీఓటు మాకేసి మమ్మల్ని గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడతాం.అంతా మీదయ అంటూ ఓటర్లను వేడుకుంటున్నారు.ఓటరు మాత్రం సరేలే మాఓటు మీకేకదా అన్నా,ఏమో ఎవరి మనస్సుల్లో ఏముందోనంటూ పోటీచేసే అబ్యర్థులు మీబాగ్యం అంటూ నిట్టూరుస్తున్నారు. అంతేగామరీ!.

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి

కోవూరు, నవంబరు 4 ప్రభాతవార్త : కోవూరు మండలంలో గురువారం జరగనున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన బుధవారం కోవూరు ఎస్సై ముత్యాలరావు ఎన్నికలపై పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బందోబస్తు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కడా కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు సత్యనారాయణ, మహేష్, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా ఏర్పాటు

కోవూరు, నవంబరు 4 ప్రభాతవార్త : కోవూరు మండలంలో గురువారం నిర్వహిస్తున్న ఎన్నిక లకు సంబంధించి 78 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లా అధికారుల సూచనలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్వో అనిత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం అన్ని వసతులు ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు ఉన్నారు.

మండలంలో 169 పోస్టల్ బ్యాలెట్లు

కోవూరు, నవంబరు 4 ప్రభాతవార్త : కోవూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎన్ని కల అధికారులు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు చేశారు. గత మూ డు రోజులుగా బుధవారం 5 గంటల నాటికి 169 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు త మ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి సారిగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పో స్టల్ బ్యాలెట్ కేంద్రానికి వచ్చి ప్రశాంతమైన వాతా వరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం.

ఎన్నికల సామగ్రి పంపిణీపై అధికారుల పర్యవేక్షణ

: ఆర్వో మస్తాన్‌రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీ ప్రసన్న తనిఖీ

విడవలూరు,నవంబర్4ప్రభాత వార్త: మండలంలో గురువారం జరగనున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి ఎం.మస్తాన్‌రెడ్డి, తహశీల్దార్ ఏ.లక్ష్మీ ప్రసన్న బుధవారం పరిశీలించారు. మండలం లోని 50 పోలింగ్ కేంద్రాలకు అవసర మైన సామగ్రి పంపిణీ ప్రక్రియను తనిఖీ చేశారు. సిబ్బందికి కేటాయించిన సామగ్రిని జాగ్రత్తగా సరిచూసుకున్న తర్వాత సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో వెంకట రమణమ్మ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిటీసీ,జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్..

ఓటు వేయనున్న 38 వేల మంది

కోట,నవంబరు 4 ప్రభాతవార్త మున్సిపల్ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన యంత్రాగం..ఇప్పుడు జడ్పీటీసీ,ఎంపీటిసీ ఎన్నికల నిర్వమాణకు సిద్ధమైంది. గురువారం జరిగే పోలింగ్ కోసం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేసింది. మురసు తుపాను నేపధ్యంలో వాతావరణ పరిస్థితులు,స్థానిక పరిణామాలను కలెక్టర్లు నిరంతం పర్యవేక్షించాలని ఎస్ఈసీ ఆదేశించింది. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే క్షేత్ర స్థాయి అధికారుల నుంచి వాస్తవ నివేధికలు తెప్పించుకుని తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.కోట మండలంలో 38 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు.ఓటు రహస్యానికి భంగం కలగకుండా అవసరమైన చోట్ల పోలింగ్ కేంద్రం లోపల కూడా పరిస్థితులను వీడియో రికార్డింగ్ చేయాలని ఎస్ఈసీ ఆదేశించింది

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

గూడూరు, నవంబర్ 4, ప్రభాతవార్త నేడు జరగనున్న ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా 34 డిస్ట్రి బ్యూషన్ సెంటర్ల ఏర్పాటు చేసి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరిగిందని, సమస్యాత్మక గ్రామాల వద్ద అదనపు బలగాలు ఏర్పాటు చేస్తున్నామని ఓటర్లందరూ తమ ఓ టు హక్కును తప్పక వినియోగిం చుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. గూడూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐదో తేదీ జరగనున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల కొరకు జిల్లా వ్యాప్తంగా 34 సెంటర్ల ద్వారా ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 1568 పోలింగ్ కేంద్రాల్లో రేపు ఎన్నికలు జరగనున్నాయని, సంస్యాత్మక గ్రామాల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఓటర్లందరూ తన ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణకుమారి, రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జునరావు, తాసిల్దార్ ప్రసాద్, డిఎస్పి నరసింహమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలంలో బీసీ ఓటర్లే అధికం

కోవూరు,నవంబరు 4 ప్రభాతవార్త : కోవూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం పూర్తిగా సమాయత్తమైంది. మండలంలో ఉన్న 10 గ్రామ పంచాయతీల్లో 78 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉండగా.. మొత్తం మండలంలో 65708 మంది ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. వీరిలో అత్యధికంగా బీసీ ఓటర్లే ఉండడం గమనార్హం. మొత్తం మండలంలో బీసీ ఓటర్లు 29,484 మంది ఉండగా.. ఎస్టీ ఓటర్లు 9839 మంది, ఎస్సీ ఓటర్లు 12895 మంది, ఓసీ ఓటర్లు 13,520 మంది ఉన్నారు. మండలంలోని 10 పంచాయతీల్లో నాలుగు పంచాయతీలకు పైగా బీసీ ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం. ఇప్పటికే ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వారికి రిజర్వేషణ్లలో అధిక శాతం ఇవ్వాలని ప్రయత్నాలు చేపట్టినా కోర్టు ఆదేశాలతో అది అమలు కాలేదు. ప్రస్తుతం మండలంలో బీసీ ఓటర్లు అధికంగా ఉన్న నేపథ్యంలో జడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించడం గమనార్హం. మొత్తం మీద బీసీ ఓటర్లు ఏ పార్టీకి పట్టం కడతారో ఈ నెల 5వ తేది తేటతెల్లం కానుంది.

జేబీఆర్ ఉన్నత పాఠశాలలో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

కోవూరు, నవంబరు 4 ప్రభాతవార్త : కోవూరు మండలంలో గురువారం జరగనున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలకు ఎన్నికలకు సంబంధించి జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 10 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి ప్రతి పోలింగ్ స్టేషన్ ఎదుట వాటి నెంబర్ ఏర్పాటు చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అదేవిధంగా ఈ ప్రాంగణంలో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఓటరు కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసేలా కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రత్యేక కృషి చేశారు. . 10 పోలింగ్ కంద్రాలు. 28.29,30, 31, 38,39, 40,41,44,45 అన్ని పోలింగ్ కేంద్రాల్లో షామియానా ఏర్పాటు చేయడమే కాకుండా విద్యుత్ సౌకర్యంతో పాటు పోలింగ్ సిబ్బందికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను ఆయా సెక్టార్ల అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు.

తుఫాను బాధితులకు సినార్డ్ చేయూత

:బుసగాడిపాళెంలో 88 గిరిజన కుటుంబాలకు బియ్యం పంపిణీ

విడవలూరు, నవంబర్ 4 ప్రభాతవార్త: మురసు తుఫాను బాధితులకు సినార్డ్ సంస్థ అండగా నిలిచింది. డీకేఏ ఆస్ట్రియా సంస్థ సహకారంతో సినార్డ్ ఆధ్వర్యంలో విడవలూరు మండలం రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని బుసగాడిపాళెం గిరిజన కాలనీలో 88 కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. తుఫాను నేపథ్యంలో అత్యవసర సహాయంగా ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సహాయం అందించిన సినార్డ్ సంస్థ డైరెక్టర్ జవహర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ షేక్ మొబీమా, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి పసుమర్తి సుజిత్ కుమార్, సమన్వయకర్త సుజన, వాలంటీర్లు గోపినాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కావలిలో వీధి ఆవుల స్వైరవిహారం

– సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్

కావలి, నవంబర్4, ప్రభాతవార్త : కావలి పట్టణంలో ఏళ్ల తరబడి వీధి ఆవుల బెడదతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని టీడీపీ 12వ వార్డు ఇన్‌ఛార్జ్ గాదం శెట్టి వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను తక్షణమే నియంత్రించి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల ని కోరుతూ బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాదంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కావలి పట్టణంలో వీధి ఆవుల స్వైరవిహారం మితిమీరిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతంలో సరుకులు, కూరగాయల కొనుగోలుకు వచ్చే వినియోగదారులపై ఆవులు దాడి చేస్తూ, వస్తువులను లాక్కుంటూ తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ఆర్యవైశ్య ప్రముఖుడు, వృద్ధుడైన నేరేళ్ళ మస్తానయ్య పై ఆవు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో వైద్యశాలలో మృత్యువుతో పోరాడి ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని గుర్తుచేశారు. ఇలాంటి ఘోర సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే మున్సిపల్ యంత్రాంగం వెంటనే మేల్కోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి ఆందోళన బాట పడతామని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి ఆవుల యజమానులకు నోటీసులు పంపించి, గోవులు రోడ్లపై తిరగకుండా నియంత్రణ చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుమలశెట్టి శివ, పాదర్తి నాగరాజు, ఏల్చూరు రవి, పెసల పవన్ కుమార్, గొల్ల పాపారావు, రాజా సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

గండిపాలెంలో ఎన్ఎస్ఎస్ చివరి రోజు రైతు సదస్సు



ఉదయగిరి, నవంబర్ 4, ప్రభా తవార్త

ఆచార్యఎన్.జి.రంగా వ్యవ సాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్ఎంజీఆర్ వ్యవసాయ కళాశాల, ఉదయగిరి ఆధ్వర్యంలో గండిపాలెం గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా చివరి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించాలి

కోవూరు, నవంబరు 4 ప్రభాతవార్త : కోవూరు మండలంలో గురువారం జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావ ణంలో జరిగేందుకు ఓటర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనిత అన్నారు. కోవూరులో బుధవారం ఆమె మాట్లాడుతూ మొత్తం కోవూరు మండలంలో 6 రూట్లుగా విభజించి ప్రతి రూటుకు ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు, ఏర్పాట్లు కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో కోవూరు పోలీసులు పటిష్టమైన బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటు వేసే అభ్యర్థులు తమ దగ్గర ఉన్న పది గుర్తుల్లో ఏదో ఒకటి తప్పక తీసుకోవాలన్నారు. ఇప్పటికే మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోలు 70 శాతం పైగా పోలింగ్ స్లిప్పులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సురేష్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై జెడ్పీ సీఈఓ పరిశీలన

: 34 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ తనిఖీ

కొడవలూరు, నవంబర్ 4 ప్రభాతవార్త: మండలంలో గురువారం జరగనున్న ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా పరిషత్ సీఈఓ మధుసూదన్ బుధవారం పరిశీలిం చారు. మండలంలోని 34 పోలింగ్ కేంద్రా లకు అవసరమైన ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను తనిఖీ చేశారు. సిబ్బంది తమకు కేటాయించిన సామగ్రిని సరిచూసు కున్న అనంతరం సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని సూ చించారు. పోలింగ్ నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఓటరుకు ఓటు హక్కు వినియోగిం చు కునే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు.ఈ కార్యక్రమం లో రిటర్నింగ్ అధికారి శ్రీహరి, ఎఫ్ఏసీ తహసీల్దార్ ఇ. సాయిచంద్, ఎంపీడీవో వెంకటసుబ్బారావు, డిప్యూ టీ ఎంపీడీవో శ్యాంసుందర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ప్రజలతోనే పచ్చని భవిష్యత్తు

- రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కె.మాధవరెడ్డి

కావలి, నవంబర్ 4, ప్రభాతవార్త ఆరో గ్యకరమైన ప్రజలతోనే పచ్చని భవి ష్య త్తు అనిపర్యావరణహిత అలవా ట్లతోనే ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరాలు ఏర్పడతాయని 3160 రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ డాక్టర్ కే.మా ధవరెడ్డి పేర్కొన్నారు. బ్రిక్స్ సుస్థిర జీవన శైలి వారోత్సవాలలో భాగంగా 4వ రోజు కావలి ఏపీఎస్ఆర్టీసీ గ్యారే జ్‌లో సుస్థిర ఆహార వ్యవస్థలు ఆరో గ్యవంతమైన ప్రజలు, పచ్చని భవిష్యత్తు అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కావలి డిపో మేనే జర్ డి.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మాధవరెడ్డి మాట్లాడుతూ స్థిరమైన ఆహార వ్యవస్థను అలవర్చుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా పర్యావరణాన్ని, భూమిని కాపా డుకోవచ్చని తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో కొన్ని కీలక మార్పులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆహారపు అలవాట్లలో పాటిం చాల్సిన ముఖ్యమైన సూచనలను వివరించారు. మన ప్రాంతంలో పండే కూరగాయలు, పండ్లను కొనుగోలు చేయడం వల్ల రవాణా ఖర్చులు, కాలుష్యం తగ్గు తాయి. ఆయా కాలాల్లో సహజంగా లభించే పండ్ల ద్వారా నాన్యమైన పోషకాలు అందుతాయి అన్నారు. మాంసాహారాన్ని పరిమితం చేసి, పప్పుధాన్యాలు, గింజలు, సోయా వంటి మొక్కల ఆధారిత ప్రోటీన్లను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. డిపో మేనేజర్ డి.ఆది నారాయణ మాట్లాడుతూ బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల సందర్భంగా చర్చిస్తున్న ఈ అంశాలు పర్యా వరణ పరిరక్షణకు, భవిష్యత్ తరాల మనుగడకు ఎంతో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్ర మంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్.కె. ఖాజా మొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామ కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ (ఆఫీస్) జి.శ్రీని వాసులు, అకౌంట్స్ సూపరింటెండెంట్ ఇ.డి.వి.ప్రసాద్, బస్టేషన్ సూపర్‌వైజర్ డి.రవిప్రకాష్, మెకానికల్ సూపర్‌వైజర్ నజీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పి

కలువాయి నవంబర్ 4 ప్రభాతవార్త నేడు జరు గనున్న జడ్‌పిటిసి,ఎంపిటిసి ఎన్నికల నిర్వ హణలో భాగంగా జిల్లా ఎస్పి అజితా వెజండ్ల బుధవారం స్థానిక బివిఎన్ఆర్ జడ్‌పిహైస్కూల్ నందు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్ని కల నిర్వహణలో ఎటువంటి అవాంచనీయ సం ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్య లు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచిం చారు. అనంతరం పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పోలీస్ బందోబస్తు తో కలిసి క్షేతస్థాయిలో పరిశీలించారు. ఓటర్లు ఎటువంటి భయాందళన కరమైన సంఘటనలకు తావు లేకుండా తమ ఓటును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పి తెలియజేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.జిల్లా ఎస్పి వెంట సిఐ వేణుగోపాల్‌రెడ్డి,కలువాయి ఎస్ఐ ఎస్ కోటయ్య,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఓటరు స్లిప్పుల కోసం జనాల పాట్లు

కోట,నవంబరు 4 ప్రభాతవార్త స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కోట మండలంలో చెంచోడు, చంద్ర శేఖపురం,గూడలి తదితర పంచాయతీల్లో ఓటర్లకు స్థానిక బీఎల్వోలు ఓటర్ స్లిప్పులు పంపిణీ జరగ లేదు. నిబంధనల ప్రకారం ఓటర్లకు బిఎల్వోలు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలి. అయితే మండలంలో పలు పొలింగ్ కేంద్రాల ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయలేదు.దీంతో సచివాలయాల వద్దకు వెళ్లాల్సి వచ్చిందనిపలువురు ఓటర్ల తెలిపారు.కీలకమైన ఈ పంపిణీ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్య హ రించారని ఓటర్ల ఆరోపిస్తున్నారు.కాగ కొందరు బీఎల్వోలకు ఎన్నికల విధులు కేటాయించడంతో వారి పరి ధిలోని ఓటర్లకు స్లిప్పులు పంపిణీచేయలేదు.దీంతో పలు రాజకీయ పార్టీల వారే కొన్ని చోట్లఓటర్లు స్లిప్పు లు పంపిణి చేశారు. స్లిప్పులు కూడా ఇవ్వనప్పుడు తాము ఎందుకు వారికి ఓట్ల వేయాలని పలువురు ఓటర్ల ప్రశ్నించారు.

ఓట్ల పండుగ.. తాయిలాల జాతర

యధేచ్ఛగా నగదు పంపకాలు ?

కోట,నవంబరు 4 ప్రభాతవార్త అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా..ఓట్ల పండగకు ముందురోజు రాత్రి మాత్రం నోట్ల పంపిణీ జాతరలా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఓటరకు ఎర వేయడం పరి పాటిగా మారింది. ఓ ప్రధాన పార్టీ రూ 1000 చొప్పున పంపిణీ చేసింది. ప్రతి పక్షం రూ 500 చొప్పున పంపిణీ చేశారు.

మరి కొన్ని గ్రామాల్లో కట్టలు తెంచుకున్న కరెన్సీ.. కోట మండలంలో కరెన్సీ కట్టలు తెంచుకుంది. తెదేపా,వైకాపా అభ్యర్థులు ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారు. ప్రతి చోటఓటకు కనిష్టంగా రూ 500 అందిం చా రు. బుధవారం రాత్రి కోటలో అన్నిసెగ్మెంట్‌ల్లో డబ్బులు పంపిణీ ప్రారంభమైంది.నగదును బహిరంగానే పం పిణీ చేస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రధాన పార్టీల ప్రతినిధులు ఇంటింటికి తిరిగి డబ్బులు ఇవ్వడం గమనార్హం . కొన్ని గ్రామాల్లో మధ్యం కూడా కార్యకర్తలకు పంపిణీ చేశారు. పొలింగ్ రోజును ఓటు వేసి ముందు టిఫిన్, మద్యాహ్నం విందును కూడా పలు గ్రామాల్లో నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అవయవ మార్పిడి చికిత్సల్లో

అపోలో హాస్పిటల్స్ నెల్లూరుకు మూడు విశిష్ట గుర్తింపులు

- అక్టోబర్ నెలలో 6 కిడ్నీ మార్పిడి, 2 కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు
- ప్రాంతీయ వైద్యరంగంలో మూడు కీలక మైలురాళ్లు

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త – వైద్యం అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, నెల్లూరు, తన అవయవ మార్పిడి వైద్య సేవల్లో మరో ముఖ్యమైన ఘనతను నమోదు చేసింది. అక్టోబర్ నెలలో ఆరు కిడ్నీ మా ర్పిడి శస్త్రచికిత్సలు, రెండు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహించింది. ఈ సందర్భంగా అపోలో ఆసుపత్రి లో జరిగిన విలేకరుల సమావేశంలో అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఏ.కె.చక్రవర్తి, ఆసుపత్రి యూనిట్ హెడ్ విశ్వేశ్వర్ రెడ్డి, నెఫ్రాలజిస్టులు డాక్టర్ మస్తాన్ వలీ, డాక్టర్ రాకేష్‌లు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వైద్యరంగంలో మూడు కీలక మైలురాళ్లు నమోదయ్యాయని వాటిలో నెల్లూరులో తొలిసారిగా మర ణించిన దాత నుంచి కాలేయ మార్పిడి, మరణించిన దాత నుంచి సేకరించిన కాలేయాన్ని గ్రహీతకు విజయవంతంగా అమర్చడం ద్వారా నెల్లూరు ప్రాంతంలో ఈ తరహా ఆధునిక వైద్య సేవలకు నాంది పలికింది, రాయలసీమ ప్రాంతంలో ఒకే రోగికి తొలిసారిగా కాలేయం, కిడ్నీ మార్పిడి, ఒకే రోగికి కాలే యం, కిడ్నీ రెండింటినీ మార్పిడి చేసే అత్యంత సంక్లిష్టమైన వైద్య ప్రక్రియను నిర్వహించడం ద్వారా బహుళ అవయవ మార్పిడి చికిత్సలో మరో కీలక ముందడుగు పడింది. ఈ వైద్య ప్రక్రియలన్నీ నెఫ్రా లజీ, యూరాలజీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, అనస్థీషియా, క్రిటికల్ కేర్, ఇన్ఫెక్షియస్ డిసీజెస్, నర్సింగ్ విభాగాలతో పాటు ఇతర సహాయక విభాగాల సమన్వయంతో నిర్వహించబడ్డాయి. కిడ్నీ, కాలేయ మా ర్పిడి చికిత్సలు సమగ్ర వైద్య పరీక్షలు, నిపుణులైన వైద్య బృందాల సమన్వయం, ప్రత్యేక శస్త్రచికిత్సా నైపుణ్యం మరియు శస్త్రచికిత్స అనంతర నిరంతర వైద్య పర్యవేక్షణతో కూడుకున్న సంక్లిష్టమైన ప్రక్రియలు. అపోలో హాస్పిటల్స్ నెల్లూరు, అవయవ మార్పిడి వైద్య సేవలను మరింత విస్తరిస్తూ, నెల్లూ రు, పరిసర ప్రాంతాల రోగులకు ఆధునిక వైద్య చికిత్సలను అందిస్తోందని తెలిపారు. ఈ వైద్య ప్రక్రి యల్లో భాగస్వాములైన వైద్యులు, శస్త్రచికిత్స నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, అన్ని సహాయక విభాగాల సమిష్టి కృషిని ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది. ప్రాంతీయ ప్రజలకు సంక్లిష్టమైన అవయవ మార్పిడి చికిత్సలు అందుబాటులో ఉండేలా అపోలో హాస్పిటల్స్ నెల్లూరు తన వైద్య సేవలను కొన సాగిస్తోంది. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో అపోలో హాస్పిటల్స్ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ యం. శ్రీనివాస్, సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ హిమబిందు, యూరాలజిస్ట్ డాక్టర్ రంగనాథన్, అనస్థీషియా నిపుణులు డాక్టర్ రాజమోహన్ రెడ్డి, క్రిటికల్ కేర్ విభాగం డాక్టర్ కోటి తదితరులు పాల్గొన్నారు.

కావలి మండల జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజాహిద్ ఖాన్

కావలి, నవంబర్ 4, ప్రభాతవార్త నేడు జరగనున్న కావలి మండల జడ్పీటీసీ, ఎం పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయడం జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ము జాహిద్ ఖాన్ తెలియజేశారు. ఈ సంద ర్భంగా బుధవారం ఆయన మా ట్లాడారు కావలి మండలానికి సంబంధించి ఒక జడ్పి

టిసి, 15 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 1 జడ్పిటిసి స్థానానికి ముగ్గురు, 15 ఎంపీటీసీ స్థానాలకు 34 మంది అభ్యర్థులు పోటీల్లో ఉన్నారన్నారు. ఎన్నికలకు 55పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క పోలింగ్ బూత్‌కు ఒక ప్రొసీడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారి, నలుగురు ఇతర పోలింగ్ అధికారులను ఒక్కో బూతుకు మొత్తం 6మందిని నియమించడం జరిగిందన్నారు. 55 పోలింగ్ బూతులకు గాను 360 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో సిసికెమెరాలు ఏర్పాటు వీడియోగ్రఫీ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలియజేశారు. మండలంలో 95 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరిగిందన్నారు. పోలింగ్ ఏర్పాట్లను కావలి తాసిల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో ముజుఫర్ రహీంలు పర్యవేక్షించడం జరిగింది.

రూప్ కుమార్ యాదవ్ విజయం

నెల్లూరు ప్రజల విజయం : షరణి పొంగూరు

నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త – వైద్యం నెల్లూరు మున్సిపల్ ఎన్నికల పోరులో కూటమి విజయకేతనం ఎగు రవేసిన అనంతరం ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృత మైంది. దాదాపు 80,170 ఓట్ల భారీ మెజారిటీతో మేయ ర్‌గా ఘన విజయం సాధించిన పోలుబోయిన రూప్ కు మార్ యాదవ్, నేరుగా మంత్రి నారాయణ కుమార్తె షరణి పొంగూరు నివాసానికి వెళ్లారు. ప్రచారంలో వినూత్న శైలిని అవలంబిస్తూ, హిందీ ప్రసంగాలతో భిన్న వర్గాల ఓటర్లను ఆకట్టుకుని తన గెలుపునకు బలమైన వ్యూహాన్ని అందిం చిన షరణిని ఆయన ప్రత్యేకంగా కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షరణి పొంగూరు కూడా నూతన మేయర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలువగా, ఇద్దరి కలయిక నేతల సమన్వయం నెల్లూరు రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటిని సత్కరించిన గుర్రం దంపతులు

నెల్లూరు , నవంబరు 4 ప్రభాతవార్త : విద్య ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ ఎన్నికల్లో 15వ డివిజన్ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించిన జనసేన పార్టీ నాయకులు గుర్రం కిషోర్ బాబు సతీ మణి ,గుర్రం కేజీయా కుమారీలు బుధవారం రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ని నగరం లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు . ఈ సందర్భంగా గుర్రం దంపతులు వేము లపాటిని శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేముల పాటి మాట్లాడుతూ కూటమి పొత్తులో భాగంగా కార్పొరేషన్ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేసిన ఎనిమిది స్థానాల్లో నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్ తో ఘన విజయం సాధించటం గర్వకారణం అన్నారు . ఈ విజయం నగరంలో జనసేనకు ఉన్న బలాన్ని నిరూపిస్తుందని తెలిపారు. తమ అభ్యర్థులందరిలో అత్యధిక మెజారిటీని సాధించిన గుర్రం దంపతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయ కులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

11 వవార్డు కౌన్సిలర్‌కి ఘన సన్మానం

ఆటోనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని హామి

బుచ్చి నవంబర్ 4 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ పరిధిలోని 11 వవార్డు టిడిపి కౌన్సిలర్ జుపుద్దీన్ అదే వార్డుకు చెందిన రాష్ట్ర మైనార్టీ కా ర్యదర్శి జాపర్‌భాషను జుపుద్దీన్ తండ్రి యజ్దాని బాషాను పట్టణంలోని ఆటో నగర్ యూనియన్ అసోసియేషన్ ఆద్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. బా ణా సంచి కాల్చి కేక్ కట్ చేసి సంబ రా లు చేశారు. పూలమాలలు శాలువా లు వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీజి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జుపుద్దీన్ మాట్లాడుతు వేమిరెడ్డి దంపతుల ఆశీస్సులతో, చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మి సహకారంతో 11 వవార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఘన విజయం సాధించానని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వార్డులోని నాయకులు ప్రజలు దీవెనలతో నాకు 205 మెజార్టీ వచ్చిందని అందరికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. తన విజయం కోసం రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి జాపర్‌బాషా ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. ఆటోనగర్ ఆసోసియేషన్ ఆద్వర్యంలో తనను సత్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. పార్టీలకు అతీతంగా ఆటో నగర్ అభివృద్ధికి కృషి చేస్తాను.ఈకార్యక్రమంలో మన్సూర్ అహ్మద్, శ్రీనివాసులు, షాకిర్, అహ్మద్, అజీజ్, ఫిరోజ్, పెంచలయ్య, జిలానీ, మోహిద్‌బాషా, మురళీ,నాయబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మననగరాన్ని మనమే బాగు చేసుకుందాం

బుచ్చి నవంబర్ 4 ప్రభాతవార్త బుచ్చి రెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో కొత్తగా మూడో వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన బెళ్ళం పద్మ పర్యావరణ పరిరక్షణ కి సం బందించిన " మన నగరాన్ని మనమే బాగు చేసుకుందాం " అనే బ్రోచర్ని విద్యార్థుల ముందు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రతి విద్యార్థి ప్లాస్టిక్ వా డకూడదని వారి తల్లిదండ్రుల చేత కూడా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడకుండా గుడ్డ సంచులు గన్ని బ్యాగులు వాడాలని కోరారు. ఈ సందర్భంగా మీ పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్ సార్ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. ఈకరపత్రం ప్రతి ఇంటికి చేరే విధంగా ప్రయత్నం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లారెడ్డి, ప్రిన్సిపల్ సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు..

- 2 వేల మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బందితో సర్వం సిద్ధం
- జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల

నెల్లూరు క్రైమ్, నవంబర్ 4, ప్రభాతవార్త: జిల్లాలో నేడు జరగనున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా, పారదర్శ కంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వ హించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని ముం దస్తు ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 2,000 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బందితో పోలీస్ సెక్యూరిటీ డిప్లాయిమెంట్ చేయడం జరిగిందని ఎస్పీ అజిత వేజెండ్ల పే ర్కొన్నారు. జిల్లా పోలీసు సిబ్బందితో పాటు సిఐడి, విజిలెన్స్, ఏసిబి, ఈగల్ టీమ్స్, మెరైన్,ట్రాన్స్‌కో, రైల్వే పోలీసు, రేంజ్ విఆర్ సిబ్బంది, మహిళా పోలీసులు, వాలెంటీర్స్ తదితర ప్రత్యేక బలగాలను ఎన్నికల బందోబ స్తులో భాగస్వామ్యం చేసుకొని పటిష్ట బం దోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల బందోబస్తు ప్రణాళిక, విధుల నిర్వహణ, తీసుకో వాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాల్సిన విధానాలపై జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు, ఇన్‌ఛార్జి అధికారులకు బుధవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా 179 రూట్లు, 775 పోలింగ్ లొకేషన్లు, 1,639 పోలింగ్ స్టేషన్లను గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల దూరంలో కానరీ లైన్ ఏర్పాటు చేసి, ఓటర్లు మాత్రమే పోలింగ్ స్టేషన్ అనుమతించి, అనధికార వ్యక్తులు పోలింగ్ కేంద్రాల వద్ద గుమిగూడకుండా చేసి, ప్రతి ఒక్కరూ భరోసా కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అవసరమైన ప్రాంతాల్లో రైట్ గేర్ ఎక్విప్‌మెంట్, లాఠీలు, బాడీ ప్రొటెక్టర్లు, కాన్సర్టినా వైర్లు తదితర రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచడం జరిగింది. పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, కీలక రహదారులపై డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, రూట్ మొబైల్ పార్టీలు, ఎస్ఐ స్ట్రైకింగ్ ఫోర్స్, సిఐ, డిఎస్పీ, ఆడిషనల్ ఎస్పీ, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ రూపొందించి, పోలింగ్ కేంద్రాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలోని వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 2,800 మందికి పైగా ట్రబుల్ మాంగర్లను గుర్తించి, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారిని ఎంఈఎం / డిఈఎంల వద్ద బైండోవర్ చేసినట్లు ఆమె తెలిపారు. అక్రమంగా మద్యం సరఫరా చేయడం, నగదు లేదా ఇతర ప్రలోభాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందన్నారు. ముందస్తు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో జరుగుతుందని హెచ్చరించారు. ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు, గూడూరు సబ్ డివిజన్ల పరిధిలో సంబంధిత డీఎస్పీల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేసి, ఏవరీ ఓట్స్ కౌంట్ కొరకు ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగింది. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో, అప్రమత్తంగా నిర్వహించాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు సహకరిస్తూ, వారు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని సంబంధిత 34 మండలాల పరిధిలో ఉన్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు / ఎంపిడిఓ కార్యాలయాల నుంచి ఎన్నికల సామగ్రిని సంబంధిత పోలింగ్ స్టేషన్లకు పటిష్ట పోలీసు భద్రత నడుమ సురక్షితంగా తరలించడం జరిగింది. ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించేందుకు ఎస్పీ బుధవారం జిల్లా వ్యాప్తంగా సుడిగాలి పర్యటన నిర్వహించారు. పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు తదితర ప్రాంతాల్లోని ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి తరలింపు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి, సమన్వయంతో విధులు నిర్వహించాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా